ఇఎస్ఐ లబ్ధిదారుల సేవల కోసం

ప్రయివేటు ఆస్పత్రులు దరఖాస్తు చేసుకోవాలి

- ఐఎంఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇఎస్ఐ లబ్ధిదారులకు వైద్య సేవలందించేందుకు ఆసక్తి ఉన్న ప్రయివేటు ఆస్పత్రులు దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) ఆహ్వానించింది. ఈ మేరకు ఐఎంఎస్ డైరెక్టర్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరు సెట్లతో కూడిన టెండర్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. నాచారం, రామచంద్రాపురం, వరంగల్, సిర్‌పూర్ కాగజ్‌నగర్‌లలో సెకెండరీ వైద్యసేవలను సీజీహెచ్‌ఎస్ రేట్లకు అందించాల్సి ఉంటుందని తెలిపారు.

ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి విస్తరణ

హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలో తమ కార్యకలాపాలను మరింత విస్తరించినట్లు గృహ రుణాల సంస్థ ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి వెల్లడించింది. కొత్తగా హైదరాబాద్‌లోని ఇసిఐఎల్, ఆర్‌సిపురంలో రెండు నూతన శాఖలను ప్రారంభించడం ద్వారా తెలుగు రాష్ట్రాల్లో తమ నెట్‌వర్క్‌ను 18 శాఖలకు చేర్చినట్లయ్యిందని పేర్కొంది. ఈ నూతన శాఖలలో గృహ సహా, బంగారు రుణాలు కూడా ఇస్తారని ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి ఎండి, సిఇఒ అనిరుధ్ కమానీ తెలిపారు.

నదుల అనుసంధానం ఎప్పుడు?

- లోక్‌సభలో ఎంపి నామా నాగేశ్వరరావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశంలో కేంద్రం తలపెట్టిన నదుల అనుసంధానం ప్రక్రియ ఎప్పటిలోగా పూర్తి చేస్తారో చెప్పాలని, ఆ ప్రక్రియ పెద్ద ప్రహసనంగా మారిందని టిఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత నామా నాగేశ్వరరావు విమర్శించారు. గురువారం పార్లమెంట్ ప్రశ్నోత్తరాల సమయంలో నదుల అనుసంధానంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఆ ప్రాజెక్టును ఎప్పటిలోగా పూర్తి చేస్తారో నిర్దిష్ట గడువుతో తెలపాలని కేంద్రాన్ని నిలదీశారు. మంత్రి ఇచ్చిన మూడు పేజీల సమాధానంలో పూర్తి సమాచారం లేదని పేర్కొన్నారు. ఒక కటాఫ్ డేట్ పెట్టడం ద్వారా ప్రాజెక్టును పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

నేడు దేశ వ్యాప్తంగా కరవు, వరదలు వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. దేశంలో 70 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లోనే జీవిస్తున్న రైతులు, రైతు కూలీలు, వ్యవసాయ ఆధారిత ప్రజలేనన్నారు. నదుల అనుసంధానం ప్రక్రియ నత్తనడకన నడవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సాగునీరు, తాగునీరు ఇబ్బందులుండేవనీ, సిఎం కెసిఆర్ అద్భుత ప్రణాళికలతో 600 మీటర్ల ఎత్తుకు గోదావరి నీటిని తీసుకొచ్చి ప్రజలకు, రైతులకు సాగు నీటిని ఇస్తున్నారని తెలిపారు. దీంతో తెలంగాణ పల్లెలు సర్వతోముఖాభివృద్ధి చెందుతున్నాయన్నారు.

సముద్రంలో వృథాగా కలిసే నీటిని తాము ఎంతో సమర్థవంతంగా వినియోగించుకుంటున్నామని తెలిపారు.

సజ్జల వ్యాఖ్యలు అర్థం లేనివి

- వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యలు అర్థం లేనివని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షులు షర్మిల తెలిపారు.

ఎంతో మంది త్యాగాల ఫలితంగా తెలంగాణ ఏర్పడిందనీ, ఇప్పుడు రెండు రాష్ట్రాలు కలవడమేంటని ప్రశ్నించారు. రెండు రాష్ట్రాలను కలపడంపై శ్రద్ధ పెట్టేకంటే.. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. బలిదానాలతో ఏర్పడ్డ తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దని హితవు పలికారు.

బిజెపి పాలనలో ఆర్థికవ్యవస్థ అస్తవ్యస్తం

- లౌకిక, రాజ్యాంగ విలువలకు తిలోదకాలు
- సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు విజయ్ రాఘవన్
- బిజెపి, టిఆర్ఎస్ ఘర్షణలతో ప్రజాసమస్యలు పక్కదారి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

సమావేశంలో మాట్లాడుతున్న విజయ్ రాఘవన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి పాలనలో ఆర్థిక, లౌకిక, రాజ్యాంగ, ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ అస్తవ్యస్తంగా మారాయని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు విజయ్ రాఘవన్ అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. కోవిడ్-19 తర్వాత దేశంలో నిరుద్యోగ సమస్య మరింత ఎక్కువైందన్నారు. పెట్టుబడిదారులు పైపైకి ఎదుగుతుంటే పేదలు మాత్రం మరింత దిగువకు పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని (ఎన్‌ఆర్‌ఈజీఎస్) నిర్వీర్యం చేసేందుకు కేంద్రం యత్నిస్తోందన్నారు. రాజ్యాంగ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కలిసివచ్చే పార్టీలతో సిపిఎం ముందుకు సాగుతుందని తెలిపారు. ఖమ్మం నగరంలోని స్థానిక సుందరయ్య భవనంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో కలిసి విజయ్ రాఘవన్ మాట్లాడారు.

దేశంలో ధరల పెరుగుదల అధికంగా ఉందన్నారు. పట్టణాలతో పోలిస్తే పల్లెలపై దీని ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. కేంద్రం మరింతగా పన్నుల భారం మోపుతుందని ఆరోపించారు. పార్లమెంటరీ, ప్రజాస్వామ్య విలువలను నాశనం చేస్తోందని మండిపడ్డారు. విచ్చలవిడిగా డబ్బులు వినియోగించి ఎన్నికల్లో గెలవడమే కాకుండా ఎమ్మెల్యేలను, ఎంపిలను కొనుగోలు చేస్తూ ప్రభుత్వాలను కూలదోస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనారిటీలు, దళితులపై వివక్ష అధికం అవుతున్నదని, అర్బన్ మావోయిజం పుంజుకోంటుందన్నారు. విద్య, ఆరోగ్యం, ప్రజాపంపిణీ వ్యవస్థలు దెబ్బతింటున్నాయని తెలిపారు. ఓ వైపు అధిక పనిదినాల కోసం డిమాండ్లు లేవనెత్తుతున్న పరిస్థితుల్లో ఉపాధి కల్పన పథకాలను నిర్వీర్యం చేయడం తగదన్నారు. లేబర్ కోడ్స్, వర్కర్స్ చట్టాలు అమలు కాకపోగా పెట్టుబడిదారీ విధానాలు మరింతగా పుంజుకుంటున్నాయని తెలిపారు. సిఐటియు, ఎఐకెఎస్ వంటి సంఘాలను కలుపుకుని వ్యవసాయ కార్మికుల సమస్యలపై ముందుకెళ్తామని స్పష్టం చేశారు.

బిజెపి, టిఆర్ఎస్ ఘర్షణతో ప్రజాసమస్యలు పక్కదారి : తమ్మినేని

బిజెపి , టిఆర్ఎస్ ఘర్షణల కారణంగా రాష్ట్రంలో ప్రజాసమస్యలు పక్కదోవ పడుతున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. తప్పుచేసిన వారిని శిక్షించడాన్ని సిపిఎం ఎక్కడా తప్పుపట్టదని, విచారణ జరగకుండానే దోష ఆరోపణలు చేస్తూ తిట్టిపోసుకోవడమే పనిగా బిజెపి, టిఆర్ఎస్ తీరుందని అన్నారు. కేంద్ర నిఘా సంస్థలను ప్రతిపక్షాలపైనే కేంద్రీకరణ చేయడం చూస్తే బిజెపి తెలంగాణలో ఎలాగైనా పాగా వేయాలనే దుర్బుద్ధిని వెల్లడిస్తుందన్నారు. పార్టీల ఫిరాయింపుల కోసం ఓ బాధ్యుడినే కేటాయించడం హాస్యాస్పదమన్నారు. ఒకటి, రెండు ఎన్నికల్లో కొన్ని స్థానాల్లో గెలిచినంత మాత్రాన తామే అధికారంలోకి వస్తామనుకోవడం బిజెపి అవివేకానికి నిదర్శనమని తెలిపారు. ఫ్యూడలిజాన్ని పారదోలి సెక్యులరిజాన్ని ప్రతిష్టించిన చరిత్ర తెలంగాణ ప్రజానీకనిదని స్పష్టం చేశారు. రాజకీయ దురుద్దేశాలతో ప్రజాసమస్యలు పక్కదోవ పడుతున్నాయన్నారు. బిజెపి నాటకాలు, డ్రామాలు ప్రజలు అర్థం చేసుకోలేని స్థితిలో లేరన్నారు. షర్మిల బిజెపి వదిలిన బాణమే అని అర్థమవుతుందన్నారు. దక్షిణ తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర సర్కారు సైతం వెనుకబడిందన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న విధంగా ప్రాజెక్టులకు జాతీయ హోదా, కాజీపేట కోచ్‌ఫ్యాక్టరీ వంటివేవి కేంద్రం ఆచరణలో పెట్టలేదన్నారు. పోడుభూములు, అసంఘటిత రంగ కార్మికులు, ధరణి సమస్యలు ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని పరిష్కారం దిశగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

పోడు సర్వేల్లో లోపాలున్నాయని 36 ఏండ్లుగా నివాసం, సొంత భూమిని పరిగణలోకి తీసుకోకపోవడం సరికాదన్నారు. వలస ఆదివాసీలను రాష్ట్రం నుంచి వెళ్లాగొట్టాలనడం, సర్వేలో వారిని పరిగణలోకి తీసుకోకపోవడం చట్టవిరుద్ధమన్నారు. దళిత బంధుతో పాటు ముస్లిం, బిసి బంధు వంటి డిమాండ్లు కూడా వినిపిస్తున్న నేపథ్యంలో వాటిని సైతం అమలుచేయాలని సిఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాలపై కోర్టు తీర్పు ఇచ్చినా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఆందోళనలను కొనసాగిస్తామన్నారు. రాబోయే కాలంలో జరిగే పోరాటాలకు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారు. సమావేశంలో సిపిఎం జాతీయ నాయకులు ఎన్. చంద్రన్, కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వర్లు, బొంతు రాంబాబు, కల్యాణం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కుంటలో పడి ఇద్దరు బాలురు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రమాదవశాత్తు కుంటలో పడి ఇద్దరు బాలురు మృతి చెందిన సంఘటన జయశంకర్-భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం దుంపిల్లపల్లి గ్రామంలో గురువారం జరిగింది.

కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపూర్ మండలం గుండేడు గ్రామానికి చెందిన నాంపల్లి పరశురాం (13), మొగులపల్లి మండలానికి చెందిన గుండారపు వర్షిత్ (8) ఇద్దరూ కలిసి బహిర్భూమి నిమిత్తం దుంపిల్లపల్లి గ్రామంలోని చందునాయక్ కుంట సమీపంలోని చెరువు వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తు ఇద్దరూ కాలుజారి కుంటలో పడిపోయారు. ఎవరూ గమనించకపోవడంతో నీటిలో మునిగిపోయారు.

చాలా సేపటి వరకు పిల్లలు కనిపించకపోవడంతో వారి తల్లిదండ్రులు గ్రామంలో వెతికినా ఆచూకీ తెలియలేదు. చివరికి కుంటలో పడి ఉంటారనే అనుమానంతో జాలర్లతో వెతికించగా.. ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. పరశురాం 6వ తరగతి, వర్షిత్ రెండవ తరగతి చదువుతున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ నరిగంటి శ్రీకాంత్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రాష్ట్రంలో క్వాంటమ్ ఎనర్జీ తొలి డీలర్‌షిప్ ఏర్పాటు

హైదరాబాద్ : విద్యుత్ స్కూటర్ల తయారీదారు క్వాంటమ్ ఎనర్జీ రాష్ట్రంలో తన తొలి డీలర్‌షిప్‌ను హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో తెరిచింది. గురువారం ఈ నూతన డీలర్‌షిప్‌ను క్వాంటమ్ ఎనర్జీ ఉన్నతాధికారుల సమక్షంలో తెలంగాణా రాష్ట్ర ఐటి శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ లాంఛనంగా ప్రారంభించారు.

ఈ షోరూమ్‌లో మూడు ఇవి స్కూటర్లను అందుబాటులో ఉంచింది. త్వరలోనే సికింద్రాబాద్, వరంగల్‌లో నూతన షోరూంలను తెరువనున్నట్లు ఆ సంస్థ తెలిపింది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశాలో విక్రయాలను కలిగి ఉన్నట్లు వెల్లడించింది.

పలు అభివృద్ధి పనుల ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వడ్లు కొనమంటే.. నూకలు బుక్కమని.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణ ప్రజలను అవహేళన చేసిందని ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం గట్లమల్యాల గ్రామంలో 40 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్, సామూహిక గొర్రెల షెడ్‌ను మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. షెడ్లలో లబ్దిదారులకు సంప్రదాయ దుస్తులు అందజేశారు. హెల్త్ కిట్లను పంపిణీ చేశారు. గట్లమల్యాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సిఎం కెసిఆర్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే నంగునూరు మండలం వాగు అవతలి గ్రామ ప్రజలకు మేలు చేకూరేలా రోడ్డు వేసి బస్సు తెచ్చారని గుర్తు చేశారు. నేడు దవాఖానా తెచ్చామన్నారు. నంగునూరు నుంచి ఖాతా వరకూ డబుల్ లైన్‌రోడ్డు వేసుకున్నామన్నారు. విద్యుత్ సబ్ స్టేషన్లు, 7 చెక్

డ్యాములతో నీళ్ల ఊటలు పెరిగాయన్నారు. మండల కేంద్రంలోని పిహెచ్‌సి గట్లమల్యాల గ్రామానికి తెచ్చుకున్నట్టు వివరించారు. ఎఎన్‌ఎం సబ్ సెంటరులోనే తాత్కాలిక భవనం, శాశ్వత భవనానికి రూ.2 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ యాసంగిలో కాళేశ్వరం నీళ్లు తెచ్చి నంగునూరు పెద్దవాగులో నింపుతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరును, గట్లమల్యాల గ్రామ అభివృద్ధి పనులు గురించి వివరించారు.

కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ముజామిల్ ఖాన్, రాష్ట్ర ఆయిల్ ఫామ్ రైతు వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షులు ఎడ్ల సోమిరెడ్డి, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కర్ణ కంటి రేణుక వేణుగోపాల్, జిల్లా వైద్యాధికారి కాశీనాథ్, గ్రామ సర్పంచ్ తిప్పని రమేష్, ఉపసర్పంచ్ ప్రకాశ్ రెడ్డి, సొసైటీ చైర్మన్ ఎల్లంకి మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని రైతుల రాస్తారోకో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యం కొనుగోళ్లలో అనేక అక్రమాలకు పాల్పడుతున్న రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నర్సంపేట మండలం ఇటుకాలపెల్లి గ్రామంలో జాతీయ రహదారిపై రైతులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్య సమ్మయ్య మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లలో రైస్ మిల్లర్లు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారని, రైస్ మిల్లర్లకే పూర్తి అధికారాలు ఇచ్చినట్టు ప్రభుత్వం, అధికార యంత్రాంగం వ్యవహరించడంతో వారి ఆగడాలకు అడ్డులేకుండా పోయిందని మండిపడ్డారు. బస్తాకు మూడు నుంచి నాలుగు కిలోల తరుగును తీస్తూ కోతలు విధిస్తున్నారని అన్నారు. కొనుగోలు కేంద్రాల బాధ్యతను రైసుమిల్లర్లకు అప్పజెప్పడం వల్ల 40 కిలోల బస్తాకు నాలుగు నుంచి ఐదు కిలోలు కోత విధిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 40 కిలోల 750 గ్రాములు ఒక బస్తా తూకం వేయాల్సి ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకాలు చేయకుండా రైస్ మిల్లులకే ధాన్యాన్ని తరలించడంతో రైతులు నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైసుమిల్లర్లతో అధికారులు కుమ్మక్కయ్యారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. వాస్తవానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలు నిర్వహించడంలేదని, కొనుగోలు కేంద్రం నుంచి మిల్లుకు తరలించే వరకు రైతే రవాణా చార్జీలనూ భరిస్తున్నాడని అన్నారు. ప్రభుత్వం స్పందించి రైస్ మిల్లర్ల ఆగడాలను నియంత్రించాలని కోరారు. లేదంటే ఆందోళన, పోరాటాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వి.రామ్మూర్తి చేరుకొని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

స్పష్టమైన హామీ ఇచ్చేంతవరకు ఇకనుంచి కదిలేది లేదని జాతీయ రహదారిపై దాదాపు నాలుగు గంటలపాటు భీష్మించుకుకూర్చున్నారు. అదనపు కలెక్టర్‌తో మాట్లాడి కొనుగోలు కేంద్రాల్లోనే తూకాలు వేస్తామని, ప్రభుత్వ నిబంధనల ప్రకారమే కొనుగోలు చేస్తామని, రైసు మిల్లర్ల దోపిడీని అరికడతామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఈర్ల పైడి, సిపిఎం గ్రామ కార్యదర్శి ఎస్కే అన్వర్, పెండ్యాల సారయ్య, నాయకులు మాంకాల శ్రీనివాస్, బస్కె మొగిలి, సర్పంచ్ బానోతు రాము, సొసైటీ డైరెక్టర్ రవీందర్, వార్డు మెంబర్ బూడిది రవి, తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సబితా ఇంద్రా రెడ్డి

'మన ఊరు-మనబడి' పనులు పూర్తి చేయండి

- జిల్లా కలెక్టర్లకు మంత్రి సబిత ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ నెలలోపు ప్రతి మండలంలో రెండు చొప్పున 1,210 పాఠశాలలను 'మన ఊరు-మనబడి' కార్యక్రమానికి సంబంధించిన పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. వాటిని ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని కోరారు. 'మన ఊరు - మన బడి' కార్యక్రమంలో చేపట్టిన పనుల పురోగతిపై గురువారం జిల్లా కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. మొదటి దశ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 'మన ఊరు-మన బడి' కార్యక్రమానికి రూ.7,289 కోట్లను కేటాయించామని గుర్తు చేశారు. మొదటి దశలో భాగంగా 9,123 పాఠశాలలకు 12 రకాల మౌలిక సదుపాయల కల్పనకు రూ.3,497 కోట్లను కేటాయించామని మంత్రి వివరించారు. పనులను వేగవంతం చేయాలని కోరారు. వాటిని పర్యవేక్షిస్తున్న ఏజెన్సీలతో, పాఠశాల యాజమాన్య కమిటీలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ నెలలోనే రాష్ట్ర వ్యాప్తంగా 1210 పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. వాటికి వెంటనే డ్యూయల్ డెస్కులను అందజేయాలని అధికారులను ఆదేశించారు. వాటిలో గ్రంథాలయాలను, ఆట స్థలాలను సిద్ధం చేయాలని సూచించారు. పాఠశాలలకు విడుదల చేసిన స్కూల్, స్పోర్ట్స్ గ్రాంట్లను వినియోగించుకునేందుకు కొత్త మార్గదర్శకాలు విడుదల చేశామన్నామరు. వాటిని సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు మంత్రి సూచించారు. పనులు పూర్తి చేసుకున్న ఉన్నత పాఠశాలలకు వెంటనే డైనింగ్ హాల్ ఫర్నిచర్‌ను అందజేయాలని విద్యాశాఖ ఉన్నతాధికారులను ఆమె ఆదేశించారు. 200 మంది విద్యార్థులకన్నా ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ చైర్మెన్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వేకు.. ఇంధన పొదుపు అవార్డులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ సంస్థ ప్రకటించిన జాతీయ ఇంధన పొదుపు అవార్డుల్లో ఏడింటిని దక్షిణ మధ్య రైల్వే కైవసం చేసుకుంది. రైల్వే స్టేషన్ల విభాగంలో కాచిగూడ రైల్వే స్టేషన్ మొదటి బహుమతిని దక్కించుకున్నది. 2022 ఏడాదిలో ఇంధన పొదుపు కోసం తీసుకున్న చర్యల ఆధారంగా అవార్డుల ఎంపిక జరిగింది. జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 14న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు. దక్షిణ మధ్య రైల్వే 11 ఏండ్లుగా విద్యుత్ మంత్రిత్వ శాఖ నుంచి జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డులను అందుకుంటున్నది. ఇంధన శక్తి పరిరక్షణ కోసం చేపట్టే వివిధ వినూత్న, సమర్థవంత చర్యలను తీసుకుంటూ వాటిని అమలు చేయడం వలన ఈ అవార్డులను అందుకోవడంలో సహాయపడింది. ఈ ఘనత సాధించడంలో కీలక పాత్ర పోషించిన దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్లు, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ అధికారులు, సిబ్బందిని ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అభినందించారు.

12 కిలోల కాలేయం తొలగింపు

- గృహిణికి ఒకే రోజు కాలేయం, మూత్రపిండాల మార్పిడి
- 14 గంటలు శ్రమించిన కిమ్స్ వైద్యులు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ఎవరికైనా కాలేయం 12 కిలోల బరువు ఉందంటే అసలు వైద్య చరిత్రలోనే నమ్మడం చాలా కష్టం. ఒక మహిళ పాలీసిస్టిక్ లివర్ అండ్ కిడ్నీ డిసీజ్‌తో బాధపడుతున్నారంటే ఆమె ప్రాణాలు కాపాడడం వైద్యులకు అతిపెద్ద సవాలు. ఒకేరోజు కాలేయం, మూత్రపిండాలు కూడా మార్చేందుకు హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో ముగ్గురు కాలేయ మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు, ఒక మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్స నిపుణుడితో కూడిన బందం అవిశ్రాంతంగా పనిచేసి ఆ గృహిణి ప్రాణాలు కాపాడారు. 12 కిలోల బరువున్న కాలేయాన్ని తొలగించి, విజయవంతంగా శస్త్రచికిత్స చేయడం భారతదేశంలోనే ఇదే మొదటిసారి అని ఆ హాస్పిటల్ వైద్యులు తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురి ప్రాంతానికి చెందిన ఉషా అగర్వాల్ అనే 50 ఏళ్ల గహిణికి ఈ శస్త్రచికిత్సలు చేసి ఆమె ప్రాణాలు కాపాడినట్లు పేర్కొన్నారు. సాధారణంగా ఆరోగ్యవంతుల్లో కాలేయం బరువు 1.5 కిలోలు మాత్రమే ఉంటుంది. అది ఉదరంలో కుడివైపు పైభాగంలో పావువంతు మాత్రమే ఉంటుంది. మొత్తం 14 గంటలపాటు కొనసాగిన ఈ శస్త్రచికిత్సలో కాలేయమార్పిడి శస్త్రచికిత్స నిపుణులు కన్సల్టెంట్, చీఫ్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్, హెచ్‌పిబి సర్జరీ డాక్టర్ రవిచంద్ సిద్దాచారి, సీనియర్ కన్సల్టెంట్ హెపటోబైలియర్ పాంక్రియాస్, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ సచిన్ డాగా, కన్సల్టెంట్ హెచ్‌పిబి, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ కె.ఎన్.పరమేశ, కన్సల్టెంట్ యూరాలజిస్టు, రీనల్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. శస్త్రచికిత్సల తర్వాత చీఫ్ హెపటాలజిస్టు డాక్టర్ శరత్‌పుట్టా, సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్టు డాక్టర్ వి.ఎస్. రెడ్డి పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులపై బిజెపి సర్కార్ వివక్ష

- ఎస్‌సి హోదా కల్పించకుంటే పెద్ద ఎత్తున నిరసనలు

-మేడే రాజీవ్ సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దళిత క్రైస్తవులపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వివక్ష చూపిస్తున్నదని తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ విమర్శించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదా ఇవ్వలేమని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలపడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత క్రైస్తవులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడం ఇష్టం లేకనే బిజెపి సర్కార్ కుట్రలు చేస్తున్నదని తెలిపారు. ఎస్‌సి హోదాను వ్యతిరేకిస్తే బిజెపి సర్కార్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రాజ్యాంగంలో ప్రజలకు వారికిష్టమైన మతాన్ని విశ్వసించే స్వేచ్ఛ ఉందనీ, ఆ మేరకు క్రైస్తవ మతంలోకి మారిన దళితులకు కూడా ఎస్‌సి రిజర్వేషన్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. 2004లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రంగనాథ్ మిశ్రా కమీషన్ ఎస్‌సి హోదాకు మతంతో సంబంధం లేదని సిఫార్సు చేసిందని గుర్తుచేశారు. దళిత క్రైస్తవులకు రిజర్వేషన్ ఇవ్వడం ఇష్టం లేకనే కేంద్ర సర్కార్ ఆ కమిటీ నివేదికలో తప్పులున్నాయని సుప్రీం కోర్టుకు చెప్పిందని తప్పుపట్టారు. జస్టిస్ రాజేందర్ సచార్ కమిషన్ సైతం ఎస్‌సి హోదా కల్పించాలని సిఫారసు చేసిందని తెలిపారు. 2008లో సామాజిక వేత్త సతీశ్ దేశ్ పాండే దళిత క్రైస్తవులను ఎస్‌సిలుగా గుర్తించాలని చెప్పారనీ, జాతీయ ఎస్‌సి కమిషన్ కూడా ఈ మేరకు సిఫారసు చేసిందని గుర్తుచేశారు. సరైన గణాంకాలు లేవంటూ ఈ సిఫారసులను తోసిపుచ్చడం కుట్రేనని తెలిపారు. దళితులు మతం మారితే దళితులుగా గుర్తించలేమనే తీర్పు... దళితుల హక్కులకు శరాఘాతమని తెలిపారు.

దర్గాలో ప్రార్థనలు చేస్తున్న హోం మంత్రి మహమూద్ ఆలీ

జమాలే బాహెర్ దర్గాలో ఉర్సు ఉత్సవాలు

- ప్రత్యేక ప్రార్థనల్లో హోం మంత్రి మహమూద్ అలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని దర్గా హజరత్ జమాలే బాహెర్ ఉర్సు ఉత్సవాలకు గురువారం హోం మంత్రి మహమూద్ అలీ, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ మసిఉల్లాహ్ ఖాన్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ అఫ్జల్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో హోం మంత్రి మాట్లాడుతూ.. దాదాపు 531 ఏండ్ల జమాలే బాహెర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్ నిండు నూరేండ్లు చల్లగా ఉండాలని ప్రత్యేకంగా ప్రార్థించినట్టు తెలిపారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యార్థం బౌండ్రి వాల్ నిర్మాణం, నిజాం కాలం నాటి బావిని, దర్గాను అతి సుందరంగా తీర్చి దిద్దుతామన్నారు. అందుకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో అక్రమణకు గురైన వక్ఫ్ బోర్డు ఆస్తులను సర్వే నిర్వహించి స్వాధీనం చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, దర్గా ముతవల్లి సిరాజ్ సిద్ధిఖి, శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సాబెర్ అలీ సదర్ ఖాజీ రిషత్ ఫాజిల్, జిల్లా వక్ఫ్ ప్రొటెక్షన్ కో ఆర్డినేషన్ ఆఫిషియల్ కమిటీ మెంబర్ ఎండీ ఇంతియాజ్ పాల్గొన్నారు.

గార్మెంట్ ఎక్స్‌పో ఏర్పాటు

హైదరాబాద్ : నగరంలోని హైటెక్స్‌లో ఐదవ ఎడిషన్ యూనిఫార్మ్, గార్మెంట్స్ మాన్యుఫాక్చరర్స్ ఫెయిర్-2022 ప్రదర్శన ప్రారంభమైంది. డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న ఈ ఎక్స్‌పోను మహారాష్ట్ర టెక్స్‌టైల్స్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుభాష్ దేశ్‌ముఖ్ లాంఛనంగా ప్రారంభించారు. సోలాపూర్ గార్మెంట్స్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్, మహావీర్ టెక్స్‌టైల్ గ్రూప్, సోలాపూర్‌లు సంయుక్తంగా ఈ ఫెయిర్ నిర్వహిస్తున్నాయి.

In the court of the Hon'ble prl District Judge, Ananthapuramu
A.S. No: 45/2022

Between:
N.Sunkappa died byL.Rs
N.Sudhakar Sivaprasad and others ...**Appellants**
and
N.Mallikarjuna Prasad and others
...**Respondants**

Notice to Defendant No:3

To
N.Soma Sekhar S/o Sunkappa Flat No:303. IInd Floor, D.No:2-1-471/DEF, Sharada Apartments 6th Street, New nallakunta Hydarabad (T.S)

పై అప్పీలు దావాలో మీకు నోటీసులు ఎన్నిసార్లు పంపించినను అది చేరలేదు. కావున మీరు 19-12-2022 వ తేదిన ఉదయం 10:30 గంటలకు పై కోర్టునందు మీరు స్వయంగా గానీ, లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీకు ఆక్షేపణలు తెలుపుకొనవలెను. అట్లు హాజరు కానీ యెడల పై అప్పీలు దావా మీ పరోక్షముగా తీర్మానించెదరని తెలుపడమైనది.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

వాయిదా : 19/12/2022

జి. లక్ష్మినారాయణ రెడ్డి
అడ్వకేట్, అనంతపురం

ఇంటర్ ఫీజు చెల్లింపు గడువు 12 వరకు పొడిగింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2023 మార్చిలో జరిగే వార్షిక పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫీజు చెల్లింపు గడువును ఆలస్య రుసుం రూ.100తో ఈ నెల 12వ తేదీ వరకు చెల్లించేందుకు అవకాశముందని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఆలస్య రుసుము రూ.100తో ఫీజు చెల్లింపు గడువు ఈ నెల 6వ తేదీన ముగిసిన విషయం తెలిసిందే. టిపిజెఎంఎ అధ్యక్షులు గౌరిసతీశ్ నేతృత్వంలో విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డిని కలిసి ఫీజు చెల్లింపు గడువును పొడిగించాలంటూ కోరిన విషయం విదితమే. దీంతో ఆమె స్పందించి ఫీజు గడువును పెంచాలంటూ ఇంటర్ బోర్డు అధికారులను ఆదేశించారు. ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లు ఫీజు తీసుకోవాలని ఆదేశించారు. ఇతర వివరాలకు్ ంఎఱవ.ఎష్ట్ర.ష్ట్రశీఙ.ఱఅ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

స్థానిక తయారీదారుల కోసం కెడిఎం వేట

ముంబయి : ప్రముఖ కన్స్యూమర్ లైఫ్‌స్టైల్, ప్రీమియం మొబైల్ యాక్సరీస్ బ్రాండ్ కెడిఎం మేక్ ఇన్ ఇండియా ఆలోచనలతో నూతన ప్రణాళికలను రూపొందించినట్లు పేర్కొంది. తద్వారా ఈ రంగంలో స్వయం సమద్ధిని ప్రోత్సహించాలని భావిస్తున్నామని పేర్కొంది. ఈ క్రమంలోనే కెడిఎం హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సిఆర్, బెంగళూరు, చెన్నైలో స్థానిక, కాంట్రాక్ట్ తయారీదారుల మద్దతును కోరుకుంటుందని తెలిపింది. అంతర్జాతీయ మార్కెట్‌లకూ విస్తరించాలనుకుంటున్నట్లు పేర్కొంది.

రెచ్చగొట్టి లబ్ధిపొందే పరిస్థితుల్లేవు : టిడిపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగు రాష్ట్రాల్లో సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి లబ్ధిపొందే మాటలను ప్రజలు విశ్వసించే పరిస్థితులు లేవని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్య యాదవ్ అన్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా మళ్లీ కొనసాగాలని ఏపి సిఎం ప్రభుత్వ సలహాదారుడు, వైసిపి నేత సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించడంలో కుట్ర కోణం దాగి ఉందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు సభలకు వస్తున్న భారీ ప్రజా స్పందన చూసి తట్టుకోలేకే, ప్రజల దృష్టి మళ్లించేందుకు వైసిపి ప్రయత్నం చేస్తున్నదని చెప్పారు. మూడేండ్ల వైసిపి పాలనలో అక్కడి ప్రజలు సిఎం జగన్‌పై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని గుర్తు చేశారు. దాడులు, దౌర్జన్యాలు ప్రజల ఆస్తులను లూటీచేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నా చంద్రబాబు పెట్టిన సభలకు స్వచ్ఛందంగా లక్షల మంది తరలి వస్తున్నారని వివరించారు. మళ్లీ చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలనే ప్రజల బలమైన కోరిక స్పష్టంగా కనపడుతుండటంతో దిక్కుతోచని పరిస్థితుల్లో వైసీపీ మళ్లీ మోసం చేయాలని చూస్తున్నదన్నారు.

రెండు రాష్ట్రాల్లో సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి లబ్ధిపొందాలని చూస్తున్న టీఆర్ఎస్, వైసీపీ మాటలకు కాలం చెల్లిందన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

అబ్బురపడేలా అలంకరణ

- ఆకట్టుకునేలా ఆర్చీలు, జెండాలు, తోరణాలు
- ప్రత్యేక ఆకర్షణగా అమరవీరుల స్తూపం
- ఆర్కిటెక్చర్ విద్యార్థుల సహాయంతో రూపకల్పన
- ప్రతినిధుల కోసం 'ఐ లవ్ ఎస్ఎఫ్ఐ' సెల్ఫీ పాయింట్
- ఘనంగా 17వ అఖిల భారత మహాసభ ఏర్పాట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) అఖిల భారత 17వ మహాసభకు వేదికైన ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ)లోని ఠాగూర్ ఆడిటోరియాన్ని అబ్బురపడేలా అలంకరణ చేస్తున్నారు. మల్లు స్వరాజ్యం నగర్, అభిమన్యు, ధీరజ్, అనీష్‌ఖాన్ ప్రాంగణంలో ఈ మహాసభ ఈనెల 13 నుంచి 16 వరకు జరగనున్న విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతినిధులను ఆకట్టుకునేలా ఆహ్వాన సంఘం నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకోసం ఆర్చీలు, జెండాలు, తోరణాలు, ఫ్లెక్సీలతో అలంకరిస్తున్నారు. భగత్‌సింగ్, చేగువేరా, కెప్టెన్ లక్ష్మీసెహగల్, సమ్మక్క సారక్క, ఎస్ఎఫ్ఐ ఓయూ మాజీ నాయకులు జనార్ధన్ పేరుతో ఐదు స్వాగత ద్వారాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేక ఆకర్షణగా అమరవీరుల స్తూపాన్ని ఆర్కిటెక్చర్ విద్యార్థులు రూపకల్పన చేస్తున్నారు. రెండు చేతుల మధ్యలో అమర వీరుల స్తూపం దానిపైన పుస్తకం, పెన్ను ఆపైన పిడికిలి ఎత్తిన చెయ్యి ఉండేలా ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు. జెండావిష్కరణతోపాటు అమరవీరుల స్తూపం, నాయకులు నిలబడడంతోపాటు, వరుసక్రమంలో ఉండేలా ఏర్పాటు చేస్తున్నారు. 17వ మహాసభకు సూచికగా ఠాగూర్ ఆడిటోరియంపైన 17 ఎస్ఎఫ్ఐ జెండాలను ఏర్పాటు చేస్తున్నారు. వాటి మధ్యలో ఎస్ఎఫ్ఐ మహాసభ లోగో ఉండనుంది. ఠాగూర్ ఆడిటోరియం జిగేల్‌మనేలా రంగురంగుల లైట్లను అమర్చుతున్నారు. దూరం నుంచి చూసినా అద్భుతంగా కనిపించేలా అలంకరిస్తున్నారు.

ట్రెండ్‌కు తగ్గట్టుగా...

ఎస్ఎఫ్ఐ అఖిల భారత 17వ మహాసభకు సంబంధించి సాంకేతిక పరిజ్ఞానం నేపథ్యంలో విద్యార్థుల్లో వస్తున్న మార్పులకనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ట్రెండ్‌కు తగ్గట్టుగా ప్రతినిధులను ఆకర్షించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సోషల్ మీడియాను దృష్టిలో ఉంచుకుని సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేయడం గమనార్హం. 'ఐ లవ్ ఎస్ఎఫ్ఐ' ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. దాంతోపాటు ఉద్యమ స్ఫూర్తిని ప్రతినిధుల్లో ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

అందులో భాగంగా భగత్‌సింగ్, చేగువేరా ఫొటోలతో సెల్ఫీ పాయింట్లను సిద్ధం చేశారు. ఆడిటోరియం లోపల మహనీయుల కొటేషన్లతో ఆకట్టుకునేలా ఉంటాయి. ఇక ఓయూలో గుండ్రంగా ఉండే పది పెద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. ఆర్ట్స్ కాలేజీ, ఎన్‌సిసి గేటు, పోలీస్‌స్టేషన్, లా కాలేజీ వంటి ముఖ్య ప్రాంతాల్లో అవి ఉంటాయి. ఓయూలో ప్రధాన కూడళ్ల వద్ద ఫ్లెక్సీలు, తోరణాలు, జెండాలుండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇక వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న ప్రతినిధుల కోసం ఆయా రాష్ట్రాలకు చెందిన వంటకాలను సిద్ధం చేస్తున్నారు.

18 డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ పరిధిలోని 18 డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్‌సి) నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ మేరకు టిఎస్‌పిఎస్‌సి కార్యదర్శి అనితా రామచంద్రన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈనెల 16 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. వాటి సమర్పణకు వచ్చే నెల ఐదో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు గడువుందని వివరించారు. మల్టీజోన్-1 పరిధిలో ఐదు, మల్టీజోన్-2లో 13 కలిపి మొత్తం 18 పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. ఫార్మసీ, ఫార్మాసూటికల్ సైన్స్, ఫార్మాడీలో డిగ్రీ ఉత్తీర్ణత కావాలనీ, లేదంటే క్లినికల్ ఫార్మాకాలజీ, భారత్‌లో స్థాపించిన విశ్వవిద్యాలయంలో మైక్రోబయాలజీ చదివి ఉండాలని సూచించారు. మే లేదా జూన్‌లో కంప్యూటర్ ఆధారిత పద్ధతిలో ఆబ్జెక్టివ్ విధానంలో రాతపరీక్ష ఉంటుందని వివరించారు. ఇతర వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

టిఆర్ఎస్ ఇక బిఆర్ఎస్..

- పేరు మార్పునకు ఎన్నికల సంఘం ఆమోదం
- పార్టీ అధ్యక్షుడు కెసిఆర్‌కు అధికారికంగా లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్ఎస్)... 21 ఏళ్ల కిందట ఏర్పడి తెలంగాణలో ఇప్పటి వరకూ మనుగడ సాధించిన ఈ పార్టీ శుక్రవారం నుంచి అంతర్ధానం కానుంది. దాని స్థానంలో భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పురుడు పోసుకోనున్నది. దేశ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించాలని గులాబీ దళపతి కెసిఆర్ గత కొన్నేండ్ల నుంచి భావిస్తున్న సంగతి విదితమే.

ఈ నేపథ్యంలో టిఆర్ఎస్ పేరును బిఆర్ఎస్‌గా మార్చేందుకు వీలుగా కొద్ది నెలల కిందట ఆయన పార్టీ అధ్యక్షుడి హోదాలో కేంద్ర ఎన్నికల సంఘా (ఇసి)కి దరఖాస్తు సమర్పించిన విషయం విదితమే. ఈ ప్రతిపాదనపై అభ్యంతరాలకు గడువునిచ్చిన ఇసి... తాజాగా ఎలాంటి అభ్యంతరాల్లేవని భావించి పార్టీ పేరు మార్పునకు ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు కెసిఆర్‌కు గురువారం అధికారికంగా లేఖ రాసింది.

ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం 1.20 గంటలకు బిఆర్ఎస్ ఆవిర్భావ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన కార్యక్రమాలు, ఏర్పాట్లను పూర్తి చేయాలంటూ సిఎం... తమ పార్టీ నేతలను ఆదేశించారు. ఆవిర్భావ కార్యక్రమం సందర్భంగా తనకు ఇసి నుంచి అధికారికంగా అందిన లేఖకు సమాధానంగా దానిపై కెసిఆర్ సంతకం చేయనున్నారు. ఆ తర్వాత ఆ లేఖను ఇసికి పంపనున్నారు. అనంతరం ఆయన బిఆర్ఎస్ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలంటూ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లాల అధ్యక్షులు, మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీ, కార్పొరేషన్ చైర్‌పర్సన్లు, డిసిసిబి, డిసిఎంఎస్ అధ్యక్షులందరూ హాజరు కావాలంటూ ఆయన ఆదేశించారు.

వాణిజ్య పన్నుల ద్వారా రూ.కోట్ల ఆదాయం

- సిఎస్ సోమేశ్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జార్ఖండ్ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ సీనియర్ అధికారులు ఆరాధనా పట్నాయక్, సంతోష్ కుమార్ వత్స నేతృత్వంలోని అధికారుల బృందం గురువారం బి.ఆర్.కె.ఆర్ భవన్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్‌తో సమావేశమైంది. వాణిజ్య పన్నుల శాఖ ద్వారా అమలు చేయబడిన ఉత్తమ విధానాలను సిఎస్ వారికి వివరించారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు మార్గదర్శకత్వంలో పరిపాలనలో మార్పు జరిగిందని సిఎస్ పేర్కొన్నారు. కంప్యూటరైజేషన్‌పై ఎక్కువ దృష్టి పెట్టామని ఆయన తెలిపారు. అనేక సర్కిళ్లను జోడించడం ద్వారా విభాగం పునర్వ్యవస్థీకరించబడిందని, పరిశోధన, విశ్లేషణల కోసం ఎకనామిక్ ఇంటెలిజెన్స్ యూనిట్లు ఏర్పాటు చేయబడ్డాయని సిఎస్ వివరించారు. వాణిజ్య పన్నుల శాఖలో తీసుకొచ్చిన మార్పుల ద్వారా ఆదాయం మూడు రెట్లు పెరిగి రూ.65 వేల కోట్లకు చేరిందన్నారు. పన్ను చెల్లింపుదారుల సంఖ్య కూడా గణనీయంగా విస్తరించిందన్నారు.

తెలంగాణ రాష్ట్రంలోని ఉత్తమ విధానాల గురించి తెలుసుకోవడం తమకు గొప్ప అనుభవం అని జార్ఖండ్ అధికారులు చెప్పారు. తమ రాష్ట్రంలో కూడా ఇటువంటి విధానాలను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్ నీతూ ప్రసాద్, అదనపు కమిషనర్లు సాయి కిషోర్, శ్రీ కాశి పాల్గొన్నారు.

ప్రశ్నించండి.. భవిష్యత్ మీదే

- మూఢత్వ భావనలను తిప్పికొట్టండి
- కోవిడ్ సాకుతో విద్యారంగం కార్పొరేట్ల మయం
- పిడిఎస్‌యు మహాసభలో హేతువాద సంఘం జాతీయ అధ్యక్షులు నరేంద్ర నాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలో బిజెపి ప్రభుత్వ విధానాలు, మూఢత్వ భావనలు, అసత్య ప్రచారాలతో దేశం తిరోగమనం వైపు వెళ్తున్నదనీ, ఈ ధోరణిని ప్రశ్నిస్తూ ఎక్కడికక్కడ తిప్పికొడితే యువతదే భవిష్యత్ అని హేతువాద సంఘం జాతీయ అధ్యక్షులు నరేంద్ర నాయక్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లో పిడిఎస్‌యు రాష్ట్ర 22వ మహాసభ రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అశాస్త్రీయ భావాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. చరిత్ర వక్రీకరణ వేగంగా జరుగుతున్నదనీ, చివరకు సినిమాలు, డాక్యుమెంటరీల్లోనూ దాన్ని జొప్పిస్తున్న తీరును వివరించారు. రాకెట్లు, ఆటంబాంబులు, ప్లాస్టిక్ సర్జరీలు పురాతన కాలంలో ఉన్నాయని సంఘపరివార్ శక్తులు వాదించడం విడ్డూరంగా ఉందనీ, తమ అసత్యప్రచారాలతో పిల్లల మెదళ్లను కలుషితం చేస్తున్నాయని విమర్శించారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో కులం, మతం పేరుతో విద్యార్థుల మధ్య విభజన తెస్తుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. రాందేవ్‌బాబా ఉత్పత్తులు ప్రామాణికం కాదన్నారు. ఆయన్ను దేవుడితో పోలుస్తూ కొందరు వాదించడం దుర్మార్గమన్నారు. కోవిడ్ సాకును చూపెట్టి విద్యారంగాన్ని కార్పొరేట్లకు పాలకులు కట్టబెడుతున్నారనీ, నూతన జాతీయ విద్యా విధానాన్ని దొడ్డిదారిన తీసుకొచ్చారని విమర్శించారు. దీంతో పేద పిల్లలు చదువులకు దూరం కావాల్సి వస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మహాసభల ఆహ్వాన సంఘం చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ.. మాటలతో మభ్యపెట్టి, మోసం చేసి అధికారంలోకి వచ్చిన బిజెపి దేశాన్ని అంధకారంలోకి నెట్టుతున్నదని వాపోయారు. చీకటిని పారదోలే శక్తిగా యువత మారాలని పిలుపునిచ్చారు. వాగ్గేయ కళాకారుడు, కవి జయరాజు మాట్లాడుతూ..పర్యావరణాన్ని, దేశాన్ని రక్షించుకునే బాధ్యత యువతపై ఉందన్నారు. 'ఇకపై మేం మూఢనమ్మకాలు నమ్మబోం.. కుల, మతాలనుపట్టించుకోం.. ప్రకృతిని కాపాడుకుంటాం' అంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎవరికైనా నల్లని తాడులు, జంజాలుంటే తొలగించాలని వేదిక నుంచి పిలుపునివ్వగా...తన కాలుకు కట్టుకున్న నల్లని తాడును స్పందన అనే యువతి తెంచేసింది. దీంతో ఆమెకు ఆవని పుస్తకాన్ని జయరాజు బహూకరించారు. మహాసభ ప్రారంభం సందర్భంగా పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.నాగేశ్వర్‌రావు ఆ సంఘం జెండాను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిన్‌పల్లి రాము సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. పివైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ప్రదీప్, టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అశోక్, విద్యా పరిరక్షణ కమిటీ కేంద్ర నాయకులు మనోహర్‌రాజు సౌహార్ద్ర సందేశాలిచ్చారు. ఈ సభలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ఎల్ పద్మ, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామకృష్ణ, స్వాతి, కల్పన, పృధ్వీ, సాయి, పీడీఎస్‌యూ సహాయ కార్యదర్శులు గణేశ్, ఎస్.అనిల్, నరేందర్, ఆజాద్, కోశాధికారి సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎల్ఎఫ్ ఆధ్వర్యంలో... వికలాంగులకు తొలి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ (ఎల్ఎల్ఎఫ్)తెలంగాణా ఏరోస్పేస్ విభాగంలో వికలాంగులకు తొలి నైపుణ్య అభివృద్ధి కార్యక్రమం ముగించింది. తెలంగాణాలో ఏరోస్పేస్ ఉత్పాదనా రంగంలో అంగవైకల్యానికి గురైన వారికేనంటూ ప్రత్యేకంగా తొలి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఇందుకోసం "స్కిల్ ఇండియా పథకం" తో నైపుణ్యాభివృద్ధి పథకానికి అనుగుణంగా బోయింగ్, టాటా బోయింగ్ ఏరోస్పేస్ లిమిటెడ్‌తో భాగస్వామ్యాన్ని ఏర్పర్చుకున్నాయి. తొలి విడతలో మాట, వినికిడి ఇతర సమస్యలు కలిగిన 17 మంది అభ్యర్థులు తరగతి గది శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారంతా 'ఆన్-ది జాబ్' శిక్షణ పొందారు. ఈ కార్యక్రమంలో టీబీఎఎల్ అధికారులు బోయింగ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ సర్ మైఖేల్ ఆర్థర్, బోయింగ్ ఆస్ట్రేలియా ప్రెసిడెంట్ బ్రెండన్ నెల్సన్, బోయింగ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ హెచ్‌ఆర్ స్కాట్ డ్రాక్, బోయింగ్ ఇండియా డైరెక్టర్ హెచ్‌ఆర్ అజయ్ శర్మ, బోయింగ్ ఇంటర్నేషనల్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లారా లెగ్రా, బోయింగ్ ఇండియా సౌత్ ఏసియా స్టాఫ్, బీజీఇ లీడ్ ప్రవీణ్ యజ్ఞం భట్, బోయింగ్ ఇండియా ప్రెసిడెంట్ సలీల్ గుప్తా, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ మేనేజింగ్ పార్టనర్ నూరియా అన్సారి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్ద నుంచే పార్శిల్ రవాణా సేవలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటి వద్ద నుంచే పార్శిల్ రవాణా సేవలు ఉపయోగించుకునే అవకాశం ఉందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, తపాలాశాఖ తెలంగాణ రీజియన్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కె.ప్రకాష్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ డివిజనల్ హెడ్ క్వార్టర్స్ సంచాలన్ భవన్‌లో పార్శిల్ సరుకు రవాణా వినియోగదారులతో సమావేశం నిర్వహించారు. రైల్వే బోర్డు స్ట్రాటజిక్ ప్లానింగ్, ఇంప్లిమెంటేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వి.ఎల్.సత్యకుమార్‌తో కలిసి వారు పార్శిల్ రవాణా నూతన విధానం గురించి వివరించారు. రైల్వే, తపాలశాఖ సంయుక్త సేవల ద్వారా వినియోగదారులు తామున్న చోటి నుంచి గమ్యస్థానానికి పార్శిళ్లు పంపించుకునే వీలు కలిగిందని తెలిపారు. అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ రైల్వేలు 7 వేల స్టేషన్లు, తపాలాశాఖ దాదాపు 1.5 లక్షల పోస్టాఫీసులతో దేశంలోని అన్ని ప్రాంతాలకు ఈ సేవలను అందిస్తాయని చెప్పారు. ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ జి.జాన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని కుప్పకూల్చేందుకు కేంద్రం కుట్ర

- మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి బొగ్గు గనుల వేలం ప్రకటనపై మంత్రి కెటిఆర్ గురువారం మండిపడ్డారు. సింగరేణిని ప్రైవేటీకరించబోమని ప్రధాని మోడీ కల్లొబొల్లి మాటలు చెప్పారని ధ్వజమెత్తారు. "నాలుగు బొగ్గు గనులు వేలం వేస్తున్నట్లు లోక్‌సభలో కేంద్రం ప్రకటించింది. సింగరేణిని ప్రైవేటీకరించడమంటే రాష్ట్రాన్ని కుప్పకూల్చడమే. తెలంగాణ అభివృద్ధిని ఓర్వలేక సింగరేణిపై కుట్రలు చేస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ తరహాలో గనులు కేటాయించకుండా కేంద్రం కుట్ర చేస్తోంది. లాభాల్లో ఉన్న సింగరేణిని ప్రైవేటీకరించాల్సిన అవసరం ఏముంది? బొగ్గు గనులు కేటాయించాలన్న అభ్యర్థనను పట్టించుకోలేదు. గుజరాత్‌కు మాత్రం గనులు కేటాయించుకున్నారు. గుజరాత్‌కు ఒక నీతి.. తెలంగాణకు మరో నీతా? అనేది ప్రధాని చెప్పాలి. తెలంగాణ పట్ల పక్షపాతం ఇంకెన్ని రోజులు?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

పాఠశాల పిల్లలకు ఎడబ్ల్యుఎస్ ఇన్‌కమ్యూనిటీస్ సాయం

హైదరాబాద్ : విద్యా ఫలితాలను మెరుగుపరచడానికి తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలతో కలిసి అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఎడబ్ల్యుఎస్) ఇన్‌కమ్యూనిటీస్ పని చేస్తుంది. ఇందులో భాగంగానే రంగారెడ్డి జిల్లాలోని మీర్‌ఖాన్‌పేటలో కొత్తగా పునర్‌నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థుల కోసం అల్పాహారం కార్యక్రమాన్ని, ఎడబ్ల్యుఎస్ థింక్ బిగ్ స్పేసెస్‌ను కూడా ప్రారంభించినట్లు తెలిపింది. ఇటీవల దీన్ని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి లాంచనంగా ప్రారంభించినట్లు పేర్కొంది. అమెజాన్ ఇక్కడ అనేక అభివద్ధి కార్యక్రమాలను చేపట్టిందని, షాబాద్‌లో కూడా వారు ఆసుపత్రులు, పాఠశాలలు, అంగన్‌వాడీలను పునరుద్ధరించారని మంత్రి ప్రశంసించినట్లు తెలిపింది. ఈ పాఠశాలను ఎడబ్ల్యుఎస్ పూర్తిగా పునర్‌నిర్మాణం చేసింది. విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు వీలుగా ప్రత్యేక ఎన్‌క్లోజర్ లంచ్ షెడ్‌ను, వాటర్ ప్యూరిఫైయర్‌ను, బాలబాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్లను నిర్మించి ఇచ్చామని.. ఇది తమకు సంతోషంగా ఉందని ఎడబ్ల్యుఎస్ ఇండియా, సౌత్ ఏషియా కమర్షియల్ బిజినెస్ ప్రెసిడెంట్ పునీత్ చందోక్ పేర్కొన్నారు.

విదేశీ ఆంధ్రులను ఆదర్శంగా తీసుకోవాలి

- సినీ నటుడు రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - కల్చరల్

ఎక్కడో దూర తీరానవున్నా తెలుగు భాషను, సంస్కృతిని ప్రేమించి పరిరక్షించుకుంటున్న విదేశీ ఆంధ్రులను ఇక్కడి తెలుగువారు అదర్శంగా తీసుకోవాలని ప్రముఖ సినీ నటుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్‌టిఆర్ కళా మందిరంలో గ్లోబెల్ తెలుగు అకాడెమీ ప్రారంభ సభ ఢిల్లీ తెలుగు అకాడమీ సౌజన్యంతో జరిగింది. ముఖ్య అతిథిగా రాజేంద్రప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ తెలుగువారు ఎక్కడ ఉన్నా కళ వికాసం ఉంటుందన్నారు. ప్రపంచస్థాయిలో తెలుగు ప్రతిభావంతులను గౌరవించిన ఉన్నత వ్యక్తి ఢిల్లీ తెలుగు అకాడమీ వ్యవస్థాపకుడు నాగరాజు అన్నారు. గ్లోబల్ తెలుగు అకాడెమీ ఈ కార్యక్రమం జరపటం అభినందనీయం అన్నారు. అధ్యక్షత వహించిన తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య కిషన్ రావు, సంస్థ స్థాపకుడు డాక్టర్ హరి ఇప్పనపల్లి,తదితరులు మాట్లాడారు. వేదిక పై నాట్య గురువు పద్మజా రెడ్డి, మెడికల్ కౌన్సెల్ చైర్మన్ రాజలింగం, నాగ రాజు సతీమణి లక్ష్మి లతో పాటు సంస్థ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గూడూరు,శ్రీనివాస్ రెడ్డి,వెంకటేష్,డాక్టర్ రవి అయ్యగారి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయరంగ రక్షణ కోసం ఐక్య ఉద్యమాలు

- తమిళనాడు అమరవీరుల జ్యోతియాత్ర సభలో టి సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయరంగాన్ని రక్షించడంలో భాగంగా కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని అమరవీరుల జ్యోతి యాత్ర ఉప నాయకులు, ఎఐకెఎస్ జాతీయ కమిటీ సభ్యులు టి.సాగర్ పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 13 నుంచి 16వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలోని త్రిసూర్‌లో జరుగుతున్న ఎఐకెఎస్ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. గురువారం తమిళనాడులోని హోసూరు, శూలగిరి, క్రిష్ణగిరి, కరిమంగళం, ధర్మపురి, నల్లంపల్లి, ఓమలూరు, రెడ్డిపట్టిల మీదుగా కొనసాగుతున్న అమరవీరుల జ్యోతి యాత్ర సభల్లో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) 35వ జాతీయ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. కనీస మద్దతు ధరల చట్టం చేస్తామనీ, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరిస్తామంటూ హామీ ఇచ్చిందని చెప్పారు. ఇప్పటికీ ఆ హామీని నిలబెట్టుకోలేదదని చెప్పారు. దేశవ్యాప్తంగా ఏటా 10 వేల మందికిపైగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్య నివారణ కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని చెప్పారు. ఎఐకెఎస్ 35వ అఖిల భారత మహాసభ సందర్భంగా అమరవీరుల జ్యోతియాత్ర డిసెంబర్ 5న తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య స్వగ్రామం కడవెండి (జనగామ జిల్లా) నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ యాత్ర కేరళ రాష్ట్రంలోని త్రిసూల్ వరకు కొనసాగుతుందని తెలిఆరు. యాత్రకు రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో యాత్ర నాయకుడు కృష్ణప్రసాద్, మేనేజర్ ప్రకాశన్ మాస్టార్, తమిళనాడు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

దేశంలో మార్పుకు 'హిమాచల్' సంకేతం

- భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం దేశంలో మారుతున్న రాజకీయ పరిస్థితులకు అద్దం పడుతున్నదని సిఎల్‌పినేత మల్లు భట్టి విక్రమార్క ఆశాభావం వ్యక్తం చేశారు. హిమాచల్ ప్రదేశ్ ఓటర్లకు, కాంగ్రెస్ విజయం కోసం కృషి చేసిన క్యాడర్‌కు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. హిమాచల్‌ప్రదేశ్ ప్రజలకు, ఓటర్లకు కృతజ్ఞతలు చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని సిఎల్‌పి కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మోడీ చేస్తున్న ఆకృత్యాలు, అరాచకాలను సహించలేని హిమాచల్ ప్రదేశ్ ప్రజలు బిజెపిని ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించారని చెప్పారు. గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ గెలిచే అవకాశాలున్నప్పటికీ దేశ ప్రధాని, దేశ అధికార యంత్రాంగం గుజరాత్‌లో మోహరించి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. తప్పుడు ప్రచారంతో బిజెపి విజయం సాధించిందని పేర్కొన్నారు. ఎంఐఎం, ఆప్ లాంటి పార్టీలను బిజెపి ప్రోత్సహించి లౌకికవాద ఓట్లు చీల్చి గుజరాత్‌లో గెలిచారని విమర్శించారు.

ఆప్, బిజెపి మధ్యే పోటీ ఉన్నట్టుగా మీడియాలో బిజెపిలో ప్రచారం చేయించి లబ్ధి పొందారని చెప్పారు. ప్రధాని తన స్థాయిని దిగజార్చుకుని ఒక రాష్ట్రంలో 36 సభల్లో ప్రసంగించారని ఎద్దేవా చేశారు. ఓటమికి నూతన కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే బాధ్యులు కాదని చెప్పారు. ఎంపి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కాంగ్రెస్‌లోనే ఉన్నారనీ, ఉప ఎన్నిక ప్రచారానికి రానుందుకు ఆయనకు క్రమశిక్షణ కమిటీ ఆయనకు షోకాజ్ నోటీసు ఇచ్చిందన్నారు. సమైక్య రాష్ట్రం నినాదంపై సజ్జల రామకృష్ణ చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని చెప్పారు. హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం పట్ల హిమాచల్‌ప్రదేశ్ కాంగ్రెస్ బృందానికి నాయకులకు, కార్యకర్తలకు పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బిజెపి గుజరాత్‌లో భారీ మెజార్టీతో గెలిచినా, హిమాచల్‌ప్రదేశ్, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో అధికారం కోల్పోవడం బిజెపి, మోడీ, అమిత్‌షాలకు చెంపపెట్టు లాంటిదని పిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు జి నిరంజన్ పేర్కొన్నారు.